నారమ్స్ డైరెక్టర్ జనరల్‌కు ప్రతిష్టాత్మక పురస్కారం

ఏజీవర్సిటీ: నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నారమ్స్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్‌కు ప్రతిష్టాత్మక ప్లాటినం జూబ్లీ పురస్కారం లభించింది. న్యూ ఢిల్లీలో మంగళవారం జరిగిన గ్లోబల్ సాయిల్స్ కాన్ఫరెన్స్–2024 సందర్భంగా సాయిల్ సైన్స్‌లో విశేష కృషి చేసినందుకు గాను ఆయన ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ నుంచి పురస్కారం అందుకున్నారు. ఆయనతో పాటు ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ దామోదర్‌రెడ్డి కూడా అవార్డు అందుకున్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి



ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ ఎర్రబోడ పోచమ్మ దేవాలయం సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భరత్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం పలువురు నాయకులు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కబ్జాకు పాల్పడుతున్న వారి వివరాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు భరత్ రెడ్డి తెలిపారు. భరత్ రెడ్డి మాట్లాడుతూ... సర్వే నంబర్ 7లో 400 గజాల ప్రభుత్వ స్థలం ఉందన్నారు. సదరు స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు ప్రయతిన్నస్తున్నారని ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు రాఘవేంద్ర, శ్రీకాంత్, మనోజ్, మహేందర్, నవీన్, మధు, ప్రశాంత్, కిషన్, హరీష్ ఉన్నారు.

పచ్చదనం..ఆహ్లాదం

- సెంట్రల్ మీడియం, రోడ్ల పక్కన పలు రకాల మొక్కలు
- మూడు సర్కిళ్లలో 29 కిలో మీటర్లు, 29 పనులు
- మోడల్ కారిడార్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం: జోనల్ కమిషనర్

వెస్ట్ జోనల్‌లో యుద్ధ ప్రాతిపదికన గ్రీనరీ పనులు



గచ్చిబౌలి వినాయక్ నగర్‌లో..





త్రిపుల్ ఐటీ నుంచి గచ్చిబౌలి స్టేడియం రోడ్డు

గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌ను గ్రీనరీలో మోడల్ కారిడార్‌గా తీర్చిదిద్దే లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయి. ప్రధాన రహదారులపై మొక్కలు నాటి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నారు. శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ పరిధిలోని శేరిలింగంపల్లి, చందానగర్, యూసూఫ్‌గూడ సర్కిళ్లలో గ్రీనరీ పనులు ఊపందుకున్నాయి. అర్బన్ బయోడైవర్సిటీ విభాగం ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన పనులు కొనసాగుతున్నాయి. మూడు సర్కిళ్లలో 29 కిలో మీటర్ల మేర పచ్చదనాన్ని పెంపొందించనున్నారు. శేరిలింగంపల్లి సర్కిల్‌లో కొన్ని రోడ్లలో గ్రీనరీ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. సెంట్రల్ మీడియం, రోడ్ల పక్కల వివిధ రకాల మొక్కలను నాటారు. మిగిలిన పనులు త్వరలోనే పూర్తి కానున్నాయి.

29 కిలో మీటర్లు, 29 పనులు

వెస్ట్ జోనల్ పరిధిలో 29 గ్రీనరీ పనులకు ఆమోదం లభించింది. శేరిలింగంపల్లిలో 14.5 కిలోమీటర్లు, చందానగర్ 8.5 కిలో మీటర్లు, యూసూఫ్‌గూడలో 6 కిలో మీటర్ల మేర ఈ పనులు చేపట్టనున్నారు. రాయదుర్గం జంక్షన్ నుంచి నానక్‌రాంగూడ రోటరీ వరకు మోడల్ కారిడార్ గ్రీనరీ, ఓయాసిస్ స్కూల్ నుంచి బయోడైవర్సిటీ ఫ్లై ఓవర్ వరకు ఇంటిగ్రేటెడ్ గ్రీనరీ డెవలప్‌మెంట్, ట్రిపుల్ ఐటీ జంక్షన్ నుంచి గచ్చిబౌలి స్టేడియం వరకు ,గచ్చిబౌలి క్యూ మార్ట్ నుంచి కొత్తగూడ, బొటానికల్ గార్డెన్ నుంచి హెచ్‌సీయూ బస్ డిపో, రోలింగ్ హిల్స్ సెంట్రల్ మీడియం, హెచ్‌సీయూ సౌత్ గేట్ నుంచి టాటా ఇనిస్టిట్యూట్, దివ్యశ్రీ ఓరియన్ నుంచి కియా షోరూం వరకు గ్రీనరీ పనులు కొనసాగుతున్నాయి.

చందానగర్ సర్కిల్ పరిధిలోని అయ్యప్పసొసైటీ నుంచి కావూరిహిల్స్, మెటల్ చార్మినార్ నుంచి న్యాక్ , న్యాక్ నుంచి గౌసియా కేఫ్, ఆర్టీ ఆఫీస్ నుంచి ఆల్విన్ చౌరస్తా వరకు గ్రీనరీ పనులు చేపడుతున్నారు. యూసూఫ్‌గూడ సర్కిల్‌లో ఈఎస్ఐ జంక్షన్ నుంచి గణేష్ టెంపుల్ వరకు, రహమత్‌నగర్ నుంచి శ్రీనగర్ కాలనీ, ఈఎస్ఐ హాస్పిటల్ నుంచి నేతాజీనగర్, మీటర్ ఫ్యాక్టరీ రోడ్, యూసూఫ్‌గూడ బస్తీ జంక్షన్ వరకు గ్రీనరీ పనులు జరుగుతున్నాయి. ప్రధాన రహదారులపై సెంట్రల్ మీడియంలో ఎప్పుడో పోసిన మట్టి సారం తగ్గిపోవడంతో కొత్తగా సారవంతమైన మట్టిని నింపి గ్రీనరీ పనులు చేపడుతున్నారు. రోడ్డు మధ్యలో ఉన్న చెట్లకు హాని జరక్కుండి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.



జీపీఆర్‌ఏ క్వార్టర్స్ రోడ్డులో మొక్కలు నాటిన దృశ్యం



గచ్చిబౌలి ఫ్లై ఓవర్‌పై..

మోడల్ కారిడార్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం



రాష్ట్రానికి తలమానికమైన ఐటీ కారిడార్‌ను గ్రీనరీలో మోడల్ కారిడార్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనులు చేపట్టాం. విదేశీ పర్యాటకులు, వివిధ సదస్సులకు హాజరయ్యే డెలిగేట్స్‌ను ఆకర్షించే రీతిలో పచ్చదనాన్ని పెంపొందించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నాం. శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ పరిధిలోని నాలుగు సర్కిళ్లలో గ్రీనరీ పనులు కొనసాగుతున్నాయి. సెంట్రల్ మీడియంలో గ్రీనరీ డెవలప్‌మెంట్, ఫుట్‌పాత్‌లు, జంక్షన్ ఇంప్రూవ్‌మెంట్స్ చేపట్టాం. మౌలిక వసతులకు మెరుగులు దిద్దాల్సిన అవసరం ఉంది.

–ఆర్.ఉపేందర్ రెడ్డి, కమిషనర్, వెస్ట్ జోనల్

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మియాపూర్: శ్రీలా గార్డెన్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రవిచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు శ్రీలా గార్డెన్, సుభాష్‌చంద్ర బోస్ నగర్, హైటెన్షన్ రోడ్డు, నడిగడ్డతాండ ప్రాంతాలు, సెవెన్ హిల్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 4:30 వరకు నాగార్జున హోమ్స్, సెవెన్ హిల్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి అధికారులకు సహకరించాలని కోరారు.

చందానగర్: హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

◆ ఆదిత్యానగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 02.00 గంటల వరకు ఆదిత్యానగర్, ఎస్‌సీబీ కాలనీ, ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్, కృష్ణ కాలనీ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

◆ సాయిరాంనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ప్రజయ్ సిటీ, ఇండస్ట్రీయల్ ఏరియా, దేవిహోమ్స్, భాను టౌన్‌షిప్, సత్యభారతీ ఫంక్షన్ హాల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 40, పచ్చిమిర్చి 45, బెండ 50, కాకర 40, దొండ 40, దోస 50, ఆలు 40, చామ 50, కీర 30, బీర 50, వంకాయ 50, గోకర 50, బీన్స్ 70, బీట్‌రూట్ 60, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 40, క్యారెట్ 80, చిక్కుడు 70, ఉల్లి 60(కేజీ), ములక్కాయలు (1)20 , క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 20, అల్లం 160, వెల్లుల్లి 350.

నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం

రాయదుర్గం: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో బుధవారం 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు హెచ్‌సీయూ డిపో మేనేజర్ ఎం మురళీధర్ రెడ్డి తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రయాణికులు తాము ఎదుర్కొంటున్న , ఇతర సమస్యలను ఫోన్ ద్వారా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. 9959226132కు ఫోన్ చేసితమ సమస్యను వివరించాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

25 నుంచి ఖాజాగూడలో నిత్య భిక్ష

రాయదుర్గం: అయ్యప్పస్వామి భక్తులకు ఈనెల 25 నుంచి గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడ లోని రత్నదీప్ సమీపంలోని హనుమాన్ దేవాలయంలో నిత్య భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు గురుస్వామి వెంకటేష్‌గౌడ్ తెలిపారు. గురుస్వామి కొమరగొని శంకర్‌గౌడ్ పర్యవేక్షణలో ప్రతి రోజూ మధ్యాహ్నం 1 గంట నుంచి 2.30 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. 25న ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం 2025 జనవరి 3 వరకు కొనసాగుతుందన్నారు. విధులకు వెళ్లే వారికి సౌకర్యవంతంగా పదేళ్లుగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని, అయ్యప్పస్వాములు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆ అధికారులనూ వదలం

- పార్కులు రోడ్ల పరిరక్షణ బాధ్యత కూడా మాదే
- త్వరలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తాం
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టీకరణ
- అమీన్‌పూర్ పెద్ద చెరువు సందర్శన



స్థానికులతో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

పటాన్‌చెరు: అక్రమాలకు కారకులైన అప్పటి అధికారులపై కూడా చర్యలు ఉంటాయని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. మంగళవారం పటాన్‌చెరు నియోజకవర్గం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో పెద్ద చెరువు భూభాగాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. త్వరలోనే అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్ నలుమూలలో ప్రభుత్వ, చెరువు భూములతో పాటు లేఔట్‌లోని పార్కులు రోడ్ల పరిరక్షణ బాధ్యత కూడా తమదేనని చెప్పారు. అయితే కోర్టు సూచనల మేరకే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. అమీన్‌పూర్ పెద్ద చెరువు శిఖం విస్తీర్ణంలో స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. చెరువు అలుగులు, తూములు మూసి వేయడంతో చెరువులోకి వస్తున్న నీరు బయటకు పోవడం లేదని, దాంతో శిఖం విస్తీర్ణం 400 ఎకరాలకు విస్తరించిందని తమకు ఫిర్యాదు వచ్చిందన్నారు. అమీన్‌పూర్ చెరువులో నీరు బయటకు వదలకపోవడంతో తమకున్న ప్లాట్లు నీళ్లలో మునిగాయని, ప్లాట్ల యజమానులు తమకు ఫిర్యాదు చేశారని రంగనాథ్ వివరించారు.

◆ అలాగే అమీన్‌పూర్ పెద్ద చెరువు పైభాగంలోని వెంకటరమణా కాలనీ పద్మావతి లేఔట్లను పరిశీలించారు. ఈ సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. పద్మావతి లేఅవుట్‌కు చెందిన భూమిని మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆక్రమించారనే ఆరోపణలు రావడంతో ఆయన భూములను కమిషనర్ పరిశీలించారు. ప్లాట్ ఓనర్లతో పలు వివరాలు సేకరించారు. లేఔట్‌తో పాటు రాంభూపాల్ రెడ్డికి చెందిన భూముల సర్వేకు రంగనాథ్ ఆదేశించారు. ఇదిలా ఉండగా వెంకటరమణ కాలనీకి సంబంధించిన పార్కు స్థలం గోల్డ్‌కి అనే సంస్థ కబ్జా చేసి అపార్ట్‌మెంట్ కడుతోందన్న అంశంపై రంగనాథ్ స్పందించారు. వెంకటరమణ పార్కు స్థలం కబ్జాను తేల్చే సర్వే పని పూర్తయిందని, నివేదిక రాగానే చర్యలకు ఉపక్రమిస్తామని రంగనాథ్ స్పష్టం చేశారు. అమీన్‌పూర్ పరిధిలోని శంభుని కుంట చెరువు కూడా ఆక్రమణ గురైందని ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. హైదరాబాద్ నలుమూలల నుంచి కూడా ఫిర్యాదులు వస్తున్నప్పటికీ అమీన్‌పూర్ పరిధి నుంచి కాలనీ సంఘాల వారు ఎక్కువ ఫిర్యాదులతో తన వద్దకు వస్తున్నారని రంగనాథ్ స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా కమిషనర్ పర్యటనలో స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు హాజరు కాలేదు.

విద్యుత్ అధికారులు వివరాలు..

చందానగర్:
విద్యుత్ అధికారులు...

చందానగర్ ఏడీఈ ఆదినారాయణ :	8332872962
హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ ఏఈ ఇంద్రసేనారెడి :	8985564147
చందానగర్ సబ్‌స్టేషన్ ఏఈ దీప్తి :	9440813167
వేమన కాలనీ సబ్‌స్టేషన్ ఏఈ శ్రీనివాస్‌రెడ్డి:	8985564919
తారానగర్ సబ్‌స్టేషన్ ఏఈ సుమన్ :	9440156725
ఫూజ్ ఆఫ్ కాల్ 24/7 :	9490153510

దేవాదాయ శాఖ పరిధిలోకి కొండాపూర్ ఆలయం



గచ్చిబౌలి: కొండాపూర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని దేవాదాయ శాఖ అధికారులు తమ ఆధీనం లోకి తీసుకున్నారు. రంగారెడ్డిజిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ టి శేఖర్, జిల్లా పశ్చిమ విభాగం పరిశీలకుడు కె మోహన్‌రెడ్డి, సిబ్బంది ఆలయాన్ని దేవాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకున్నట్లు ప్రకటించారు. అంతకుముందు ఆలయాన్ని పరిశీలించిన వారు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

చందానగర్: విద్యార్థులకు క్రీడలతో శారీరక శ్రమతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. మంగళవారం చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియంలో శేరిలింగంపల్లి మండల గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ 2024 ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలు విద్యార్థుల్లో దాగిన సృజనాత్మకతను వెలుగులోకి తెచ్చేందుకు దోహదపడతాయన్నారు. చదువుతో పాటు క్రీడలు చాలా ముఖ్యమని, విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం వివిధ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మారోజు ఆచార్య, శ్రీనివాస్ శంకర్, అబ్దుల్ రెహ్మాన్, డాక్టర్ అనిల్ కుమార్, లయన్ డాక్టర్ వెంకటేశ్వరావు, పవన్‌కుమార్, ఎస్ఎస్‌రావు, భీష్మా రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఇక్బాల్, చైతన్య, త్రిమూర్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అధికారులకు ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు చేయించుకుంటున్న డీసీపీ సురేశ్ కుమార్

మూసాపేట: గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలానగర్ జోన్ పోలీస్ అధికారుల కోసం కూకట్‌పల్లి వివేకానందనగర్ కాలనీలోని రిక్రియేషన్ క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని బాలానగర్ జోన్ డీసీపీ సురేశ్ కుమార్ ప్రారంభించారు. పోలీస్ అధికారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేసుకున్నారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ మూడు రోజుల పాటు శిబిరం కొనసాగుతుందన్నారు. మహిళలకు ప్రత్యేకంగా కేన్సర్ టెస్ట్ శిబిరం నిర్వహించామని తెలిపారు. పోలీసులు ఉద్యోగరీత్యా తీవ్ర ఒత్తిడితో ఉంటారని, ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

అపోలో సంస్థల ఆధ్వర్యంలో..



వీరామారావునగర్‌లో అపోలో హాస్పిటల్ ఆధ్వర్యంలో ..

మోతీనగర్: అపోలో సంస్థల ఆధ్వర్యంలో వీరామారావునగర్‌లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దంత, కొలెస్ట్రాల్, బీపీతో పాటు సాధారణ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మూడు నెలలకు ఒకసారి సాధారణ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రతిరోజు గంట నడక, జిమ్, వ్యాయామం చేస్తే ఎలాంటి వ్యాధులు దరిచేరవని సూచించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు నాగుల సత్యం గంగపుత్ర, అపోలో పీఆర్ సతీశ్, సిబ్బంది వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు ఎనలేనివి



మాదాపూర్: దివంగత ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ మహిళా సాధికారతకోసం ఎంతో కృషి చేశారని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మాదాపూర్‌లో ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ పాలనలో బడుగుబలహీన వర్గాలకు ఎంతో మేలు జరిగిందన్నారు. భారతదేశ తొలి మహిళా ప్రధానిగా ఎన్నో సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో ఎంబీసీ చైర్మన్ జేరిపాటి జైపాల్, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



అనిత (ఫైల్)

మియాపూర్: ఓ యువతి అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. న్యూ హఫీజ్‌పేట మార్తాండ నగర్‌కు చెందిన అనిత(19) స్థానిక షాపింగ్‌మాల్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుంది. ఈ నెల 12న ఉదయం ఉద్యోగానికి వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి బయటికి వెళ్లింది. మధ్యాహ్నం మాల్‌లో పనిచేస్తున్న సహోద్యోగులు ఆమె కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి అనిత డ్యూటీకి రాలేదని చెప్పారు. కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించినా ఆచూకీ తెలియరాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2లోని భ్రమరాంబ మల్లిఖార్జునస్వామి ఆలయ 15వ వార్షికోత్సవ వేడుకలను ఆలయ ధర్మకర్త శ్యామల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జునస్వామి, శ్రీ సీతా రామచంద్ర స్వాములకు శాంతి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి వార్ల ఉత్సవమూర్తులను ఊరేగించారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. ముఖ్య అతిథిగా స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ హాజరై స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, శివరాజు గౌడ్, లింగయ్య, గోపాల్‌రెడ్డి, సాయి ప్రభాకర్ పాల్గొన్నారు.

పార్కు పనుల పరిశీలన

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధి రాజీవ్‌గాంధీ నగర్ పార్కు పనులను కార్పొరేటర్ సబిహా బేగం, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చొరవతో ఖాళీ ప్రదేశంలో పార్కు, ఓపెన్‌గార్డెన్ నిర్మాణం చేపట్టామన్నారు. పనులు పూర్తయితే ఓపెన్ గార్డెన్‌లో పేద, మధ్య తరగతి వారు చిన్న చిన్న ఫంక్షన్లు చేసుకునేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డివిజన్ కోఆర్డినేటర్ వీరారెడ్డి, నాగుల సత్యం, జ్ఞానేశ్వర్, అబ్దుల్ హమీద్, సయ్యద్ రియాజ్, అస్లాం, సలావుద్దీన్, మల్లేశ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి 'విల్లా'విల!

రూ.కోట్లు వెచ్చించి విల్లాలు కొన్నా తప్పని ఇక్కట్లు



నత్తనడకన సాగుతున్న ఓవర్‌హెడ్ ట్యాంక్ పనులు

- రెండేళ్లయినా పూర్తికాని రిజర్వాయర్
- గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసుల నిత్య గోస

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీ వాసులు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోట్లాది రూపాయలతో విల్లాస్‌లు కొనుగోలు చేసిన వీరికి మాత్రం తాగనీటి ఇబ్బందులు తప్పడంలేదు. ఈ సమస్యను పరిష్కరించేందుకు గత ప్రభుత్వం ఉస్మాన్‌నగర్‌లో భూమిని కేటాయించింది. 40లక్షల లీటర్ల సామర్థ్యంగల సంపు, 20 లక్షల సామర్థ్యం గల ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం, 22 కిలోమీటర్ల పైపులైన్ నిర్మాణం కోసం సుమారు రూ.30 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ పనులకు 2022 నవంబరు 10న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాన చేశారు. కానీ రెండేళ్లు గడిచినా ట్యాంకు నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో సుమారు 60గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు న్నాయి. ఈ కాలనీలో సకల సౌకర్యాలు ఉన్నప్పటికీ తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. కాలనీలో ఉన్న బోరు నీటినే వారు వినియోగించుకుంటున్నారు, కాగా, సంపు పనులను పూర్తిచేసి కొద్ది రోజుల క్రితం ట్రయల్ రన్ నిర్వహించినట్లు అధికారులు చెబుతున్నారు. త్వరలో ఈ సంపు ద్వారా 12 గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులకు తాగునీటిని అందించేందుకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది. కాగా 20 లక్షల సామర్థ్యం గత ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం పూర్తి కావడానికి మూడు నేలలు పట్టవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

పార్కును అభివృద్ధి చేయండి

మణికొండ: ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న పార్కును మున్సిపాలిటీ పాలకవర్గం సకాలంలో అభివృద్ధి చేయకపోవటంతో వృథాగా మారిందని, ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని అభివృద్ధి చేయాలని మణికొండ మున్సిపాలిటీ , మారుతీనగర్ కాలనీ వాసులు అన్నారు. మంగళవారం మున్సిపల్ డీఈ శివసాయి కాలనీ పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లారెడ్డి ఇప్పటి వరకు నిర్మించిన ప్రహరీ పనులు, మిగిలి ఉన్న అభివృద్ధి పనుల వివరాలు తెలిపారు. లే అవుట్‌లో ఉన్న పార్కును కబ్జాకు యత్నిస్తే పోరాడి సాదించుకున్నామన్నారు. అలాంటి పార్కులను వెంటనే అభివృద్ధి చేయాల్సి ఉన్న ఇప్పటి వరకు సగం పనులు చేసి వదిలేశారన్నారు. కొన్ని కాలనీలలోని పార్కులను అభివృద్ధి చేస్తున్న అధికారులు తమ కాలనీలోని పార్కు అభివృద్ధిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇకనైనా వెంటనే పార్కు అభివృద్ధి పనులను చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గంగాధర్ పాల్గొన్నారు.